సాక్షి నల్లగొండ

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



యాదాద్రిలో భక్తుల రద్దీ

స్వాతి నక్షత్రం సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగింది. - 8లో



అవగాహన కల్పించాలి

ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని దేశీ కోర్స్ కన్సల్టెంట్ శ్రీమతి అరవింద అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 34°/15°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వివాహాలకు రాయితీపై అద్దె బస్సులు

నల్లగొండ రూరల్ : వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులను ప్రత్యేక రాయితీపై సమకూర్చుతున్నట్లు ఆర్ఎం శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల బస్సు సర్వీస్‌లపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు 10శాతం రాయితీ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. బస్సులు అద్దెకు కావాల్సిన వారు సమీప డిపోల వద్ద సంప్రదించాలని సూచించారు.

రాజ్యాధికారం కోసమే స్వరాజ్య యాత్ర



దామరచర్లలో సాగుతున్న పాదయాత్ర

మిర్యాలగూడ : రాష్ట్రంలో అట్టడుగు బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం తీసుకురావడమే లక్ష్యంగా స్వరాజ్య పాదయాత్ర చేస్తున్నట్లు దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ఆదివారం దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం, రాజాగట్టు, దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం, ఇర్కిగూడెం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో డీఎస్పీ జెండాలను, శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. భవిష్యత్ అంతా డీఎస్పీ ఉద్యమమే నడుస్తుందని, అగ్రకుల రెడ్డి, వెలమల రాజ్యాన్ని దింపి అట్టడుగు కులాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అధికారాన్ని కట్టబెడతామని అన్నారు. కార్యక్రమంలో ఎల్లయ్య, సైదులు, మల్లేష్, రాము, డేవిడ్, శ్రీనివాస్, సతీష్, చందు, రాజశేఖర్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి మేళాలో నల్లగొండ 4వ స్థానం

రామగిరి(నల్లగొండ) : తపాలా శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు నిర్వహించిన సుకన్య సమృద్ధి మెగా మేళాలో తెలంగాణ సర్కిల్‌లో నల్లగొండ డివిజన్ 4వ స్థానంలో నిలిచినట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ రఘునాథస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నల్లగొండ డివిజన్ పరిధిలో 2,280 సుకన్య సమృద్ధి ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. జిల్లాలో మొదటగా నల్లగొండ పట్టణానికి చెందిన డోగిపర్తి నీలిమా సుకన్య సమృద్ధి ఖాతా నుంచి సగం డిపాజిట్ పొందినట్లు తెలిపారు.

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ వద్ద హైవేపై వాహనాలు

చౌటుప్పల్, బీబీనగర్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. వీకెండ్‌తో పాటు పెద్ద ఎత్తున పెళ్లిళ్లు ఉండడంతో ఇరుమార్గాల్లో వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగించాయి. చౌటుప్పల్‌లో వారాంతపు సంతకు వచ్చిన ప్రజలు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌరస్తాల వద్ద వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలా ఉండగా చౌటుప్పల్ మండలంలోని రెడ్డిబావి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా కొంతసేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే విధంగా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి. శుభకార్యాలతో పాటు యాదాద్రి క్షేత్రానికి భక్తులు భారీగా తరలిరావడంతో రద్దీ ఏర్పడింది.

వైభవంగా సౌరహోమం

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే క్షేత్రంలో సూర్యభగవానుడి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కాకులారపు జనార్దన్ రెడ్డి, కర్నాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ రవాణా

- బుక్ చేసుకుని నెల గడిచినా జాడ లేని ఇసుక
- ప్రభుత్వ పనుల పేరిటరోజూ వందల ట్రాక్టర్లలో తరలింపు
- అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో జోరుగా అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి



వేములపల్లి మండలం రావులపెంట నుంచి ట్రాక్టర్లలో తరలుతున్న ఇసుక

మిర్యాలగూడ : ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుంటే 3, 4 రోజుల్లోపే ఇసుక వినియోగదారునికి సరఫరా అవుతుంది. కానీ, మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో మాత్రం ఆఫ్‌లైన్‌లోనే ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ పనుల పేరిట అక్రమంగా రవాణా చేస్తూ కొందరు జేబులు నింపుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో యథేచ్ఛగా ఈ వ్యవహారం సాగుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు కనుసనుల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడం కొసమెరుపు.

మన ఊరు – మన బడి పనుల పేరిట..

మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల మరమ్మతులకు ఇసుక అవసరం ఉండగా ఇందుకోసం తహసీల్దార్లు ట్రాక్టర్ యజమానులకు లెటర్లు ఇస్తున్నారు. కానీ, దానిపై ఇన్ని ట్రాక్టర్లు అని రాయకుండా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనుమతి అంటూ లెటర్లు ఇస్తుండడంతో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అయితే.. మన ఊరు– మన బడి పథకం కింద పాఠశాలల మరమ్మతు పనులు దాదాపు పూర్తయినా వాటి పేరుతో గత నెల రోజుల నుంచి తహసీల్దార్ ఇసుక రవాణాకు లెటర్లు ఇస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు పంచాయతీరాజ్ అధికారితో ఇసుక అవసరం ఉందని చెప్పించుకుని తహసీల్దార్ ద్వారా లెటర్లు పొందుతూ భారీగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన ఓ ఇసుక దళారి తహసీల్దార్ నుంచి అనధికారికంగా లెటర్లు పొంది వాటిని ఇసుక రవాణాదారులకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఒక్కో లెటర్ రూ.2 వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. రోజూ తహసీల్దార్ నుంచి పదుల సంఖ్యలో లెటర్లు జారీ అవుతుండడంతో వాటి ద్వారా వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాలో అధికార పార్టీ, ప్రజాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉన్నట్లు విశ్వసనీయం సమాచారం. వారి ఒత్తిడి మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఇసుక అక్రమ రవాణా విషయమై వివరణ కోరేందుకు మిర్యాలగూడ తహసీల్దార్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఒక చోట డంప్ చేసి.. అధిక ధరకు విక్రయం

దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో భవన నిర్మాణాలు కూడా పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇసుక అవసరం కూడా ఎక్కువగానే ఉంది. మిర్యాలగూడ మండలంలోని కాల్వపల్లి, తక్కెళ్లపాడు, వేములపల్లి మండలంలోని రావులపెంట, కామేపల్లి ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచ్‌ల ద్వారా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఇసుకను సరఫరా చేయాలి. అయితే పట్టణ పరిసర ప్రాంతాల్లో వందలాది మంది వినియోగదారులు ఇసుక కోసం నెల రోజుల క్రితమే బుకింగ్ చేసుకున్నప్పటికీ ఇసుక సరఫరా కాలేదు. కానీ ఇసుక రిచ్‌ల నుంచి తరలిస్తున్న వందలాది ట్రాక్టర్ల ఇసుకను అక్రమార్కులు ఒక చోట డంప్ చేసి.. అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



తడకమళ్ల వద్ద డంప్ చేసిన ఇసుక

జాబ్‌కార్డుకు ఆధార్ లింక్

- అనుసంధానమైతేనే 'ఉపాధి' కూలి డబ్బుల చెల్లింపు
- ఉపాధి హామీ పథకం అమలులో కొత్త నిబంధన
- పారదర్శకత కోసం తప్పనిసరి అంటున్న ప్రభుత్వం
- ఉపాధి పనులకు తగ్గుతున్న కూలీల సంఖ్య



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డుకు, బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్‌ను కేంద్రం తప్పనిసరి చేసింది. రెండింటికి ఆధార్ అనుసంధానం అయిన వారికి ఫిబ్రవరి నెల కూలి డబ్బులు ఇస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పారదర్శకత కోసం తప్పనిసరి అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పనిచేసే కూలీలకు డబ్బులు జమ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

తగ్గిన కూలీలు..

ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తయి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. రిజిస్టర్ అయిన కూలీలు అందరూ పనికి రావడం లేదు. ప్రస్తుతం ఉన్న కూలీల్లో 80 శాతం మంది జాబ్ కార్డులకు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం అయిందని, మరో 20 శాతం మంది అనుసంధానం చేసుకోవాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఖాతాకు ఆధార్ అనుసంధానం అయిన కూలీలు అంతా పనులకు రాకపోవడంతో లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించడం ఇబ్బందిగా మారనుంది. దానికితోడు ఆధార్ అనుసంధానం కాని 20 శాతం మంది అంటే దాదాపు 70 వేల మందికి పైగా కూలీలపై ప్రభావం పడనుంది. ఆధార్ నిబంధనను కేంద్రం తప్పనిసరి చేసిన నేపథ్యంలో మిగతా వారంతా ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేసుకోవాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు. ఆధార్ అనుసంధానం లేకుండా పనులు చేస్తున్న వారికి కూలి డబ్బులు జమ కావడంలో ఆలస్యమవుతుందని చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకున్నది 2.01 లక్షల మందే..

ప్రస్తుతం జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన కూలీలు 3,54,584 మంది ఉన్నారు. వారిలో 2,01,746 మందికి ఇప్పటివరకు పనుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి మాత్రమే ప్రభుత్వం పనులు కల్పించింది. మరో లక్షన్నర మంది కూలీలు దరఖాస్తు చేసుకోలేదు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

గతంలో కూలీలు పనికి రాకపోయినా అక్కడ సిబ్బంది పనికి వచ్చినట్టుగా హాజరువేసి డబ్బులు పొందారు. పట్టణాల్లో ఉండేవారు కూడా జాబ్ కార్డులు పొంది అక్రమాలకు పాల్పడుతుండడంతో ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. పనిచేసే చోటే ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడం వంటి నిబంధనలు పెట్టింది. తాజాగా ఇప్పుడు జాబ్ కార్డుకు, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేస్తుండటంతో ఖచ్చితంగా అక్రమాలకు అడ్డుకట్టపడనుంది. పని చేయాలనుకునే వారు కచ్చితంగా పనులకు వెళితేనే డబ్బులు వారి ఖాతాల్లో జమ కానున్నాయి.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఆదివారం ఆలయంలో శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతంతో స్వామివారిని కొలిచారు. అనంతరం స్వాతి హోమం నిర్వహించారు. ఆ తర్వాత ముఖ మండపంలో బంగారు, వెండి కలశాలలో వివిధ ఫలామృతాలు, సుగంధ ద్రవ్యాలు నింపి పూజలు చేసి వాటితో శ్రీస్వామి, అమ్మవారిని అభిషేకించారు. ఇక ఆలయంలో సహ్రస నామార్చన, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు చేపట్టారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రధాన కళశాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు

ఉండ్రుగొండలో ముగిసిన పవిత్రోత్సవాలు

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామివారి శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ గోపురం, శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, బలిహరణం, నవకలశ స్నపనం, అభిషేకం, యాగశాలలో శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు.



శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

'మత్స్య' ఎన్నికలకు కసరత్తు

- జిల్లాలో 216 మత్స్య సహకార సొసైటీలు
- పాలకవర్గాల గడువు ముగిసినవి 160
- ఓటరు జాబితా రూపకల్పనలో నిమగ్నమైన అధికారులు
- మొత్తం 26వేల మందికిపైగా కార్మికులు



మత్స్యశాఖ జిల్లా కార్యాలయం

నల్లగొండ టూటౌన్: జిల్లాలో పాలకవర్గాల పదవీకాలం గడువు ముగిసిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు మత్స్యశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 216 మత్స్య సహకార సంఘాలు.. 26 వేల మందికిపైగా కార్మికులు ఉన్నారు. అయితే వీటిలో దాదాపు 160 సంఘాల పాలకవర్గాలకు గడువు ముగిసి సుమారు ఆరు నెలలు కావొస్తోంది. అయితే పాలకవర్గాల గడువు ముగిసిన సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా మత్స్యశాఖ అధికారులు వ్యవహరిసున్నారు.

ఐదేళ్లకోసారి ఎన్నికలు..

ఆయా సంఘాలకు ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతి సంఘంలో 11 మంది నుంచి ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టు సాగును బట్టి కార్మికులకు వివిధ పరీక్షలు నిర్వహించి సంఘంలో సభ్యత్వం కల్పిస్తారు. జిల్లాలో 15 సంవత్సరాలుగా సాగునీటి వసతి పుష్కలంగా ఉండడంతో ప్రతి సంవత్సరం 90 శాతానికి పైగా చెరువులు నిండుకుండల్లా ఉంటున్నాయి. అయితే సంఘాల్లో ఎక్కువ మంది మత్స్య కార్మికులకు సభ్యత్వాలు ఇచ్చి వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో కొత్తగా సభ్యత్వం కోసం దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య కూడా భారీగానే ఉంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు

పాలకవర్గాల పదవీకాలం గడువు ముగిసిన సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఇందుకోసం సంఘాల్లో నమోదై ఉన్న సభ్యులతో ఓటరు జాబితా తయారీలో మత్స్యశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. పాత జాబితాలో ఉన్న ఓటర్లను అన్ని పరిశీలించి, దాంట్లో ఎవరైనా చనిపోయినా, లేకపోతే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. ఓటరు జాబితా పూర్తి వివరాలతో సహకార శాఖ అధికారులకు పంపిస్తారు. సంఘాలకు ఎన్నికలను జిల్లా సహకార శాఖ అధికారులే నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికే కొన్ని సంఘాలకు సంబంధించి సహకార అధికారులకు ఎన్నికలు నిర్వహించాలని ఓటరు జాబితాను పంపించారు. వారు ఎన్నికలు నిర్వహించడానికి ముందుగానే ఆయా సంఘాల ఓటర్లకు సమాచారం పంపుతారు. ఎన్నికల నిర్వహణ తేదీ ఖరారు చేసి ఆ శాఖ అధికారుల నేతృత్వంలోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గడువు ముగిసిన వాటికే ఎన్నికలు



మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గం గడువు ముగిసిన వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు కొనసాగుతోంది. కొన్ని సంఘాల వివరాలను సహకార శాఖ అధికారులకు పంపించాం. గడువు ముగిసిన వాటికి వెంటనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకయ్య, మత్స్యశాఖ జిల్లా అధికారి

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

- వీహెచ్‌పీఎస్ సంపూర్ణ మద్దతు

నార్కట్‌పల్లి : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ చేపట్టిన జాతీయ రహదారుల దిబ్బంధం కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆదివారం నార్కట్‌పల్లిలో జరిగిన సమావేశంలో వీహెచ్‌పీఎస్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎల్.గోపాల్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్ ఎల్‌బీ నగర్ నుంచి విజయవాడ వరకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమంలో దివ్యాంగులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం కాశీం, జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్, అందె రాంబాబు, కో ఆర్డినేటర్ షణ్ముఖ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరిక శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి జలందర్, జిల్లా ఉపాధ్యక్షులు వీరబోయిన సైదులు, నక్క అశోక్, బొడ్డు సైదులు, యాదయ్య, అయిలయ్య, ఉపేందర్, వెంకటేశ్వర్లు, రమేష్, రాములు, అలీబాబు తదితరులున్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

డీలర్లకూ బయోమెట్రిక్!

- మార్చి నుంచి అమలుకు అధికారుల సన్నాహాలు
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద వేలిముద్రల సేకరణకు నిర్ణయం
- రేషన్ బియ్యం తరుగు రాకుండా తూకం వేసేలా చర్యలు
- ఈ నెలలోనే ఇవ్వాల్సిఉన్నా సాంకేతిక కారణాలతో వాయిదా



గోదాములో రేషన్ బియ్యం నిల్వ

నల్లగొండ: రేషన్ షాపుల్లో కార్డుదారులకు ఐదారేళ్ల నుంచి అమలు చేస్తున్న బయోమెట్రిక్ (వేలిముద్ర వేసే) విధానాన్ని గోదాముల వద్ద బియ్యం తీసుకునే డీలర్లకూ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గోదాముల నుంచి రేషన్ షాపులకు 50 కిలోల బస్తాలను పంపుతున్నా బస్తాకు 2 కిలోల వరకు తక్కువగా వస్తుండడంతో తాము నష్టపోతున్నామని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. రేషన్ షాపుల్లో వినియోగదారులకు ఇస్తున్న తరహాలోనే తమ వేలిముద్రలు తీసుకొని ఈపాస్ మిషన్‌లో తూకం వేసి బియ్యం ఇవ్వాలని డీలర్లంతా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో డీలర్లకూ ఈ నెల నుంచే బయోమెట్రిక్ అమలు చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. కానీ.. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తడంతో బయోమెట్రిక్ అమలు ప్రక్రియను అధికారులు మార్చి నెలకు వాయిదా వేశారు.

జిల్లాలో రేషన్ షాపులు	ఎంఎల్‌ఎస్ పాయింట్లు
991	07
మొత్తం రేషన్ కార్డుదారులు 4.6 లక్షలు	

ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా బియ్యం సరఫరా..

జిల్లాలో ఉన్న ఏడు మండల లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్ల నుంచి రేషన్ షాపులకు ప్రతినెలా బియ్యం సరఫరా అవుతున్నాయి. అయితే అక్కడ 50 క్వింటాళ్లు కాంటా వేసే మిషన్ మాత్రమే ఉంటుంది. ఒక్కో డీలర్‌కు 100 పైచిలుకు క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో డీలర్‌కు అక్కడ ఉన్న మిషన్‌పై తూకం వేసి ఇవ్వాలంటే రెండు మూడుసార్లు తూకం వేయాల్సి ఉంటుంది. కాబట్టి 50 కిలోల బస్తా చొప్పున ఓ డీలర్‌కు 100 క్వింటాళ బియ్యం ఇవ్వాల్సి ఉంటే 200 బస్తాలు వేసి పంపుతున్నారు. 100 క్వింటాళ్లకు దాదాపు 3 క్వింటాళ్ల పైచిలుకే బియ్యం తరుగు వస్తుంది. అయితే రేషన్ షాపుల్లో కరెక్టుగా తూకం వేసి వినియోగదారులకు ఇస్తుండడం వల్ల ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద నుంచి వచ్చే తరుగును తామే భరించాల్సి వస్తోందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు.

హమాలీలకు పని భారమేనా?

జిల్లాలోని ఏడు ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో డీలర్‌కు 100 క్వింటాళ్లు, పట్టణాల్లో 150 క్వింటాళ్ల వరకు బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం డీలర్ల వేలిముద్రలు తీసుకొని వేయింగ్ మిషన్ ద్వారా బియ్యం ఇచ్చేందుకు అధికారులు పూనుకున్నారు. గోదాముల్లో 50 కిలోలు జోకేందుకు అనుకూలమైన వేయింగ్ మిషన్ మాత్రమే ఉంది. ఒక్క డీలర్‌కు 100 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంటే ఆ 100 క్వింటాళ్లను గోదాముల్లో కాంటా వేయాలంటే హమాలీలు ఇబ్బందులు తప్పడం లేదు. పైగా ఒక్కో డీలర్‌కు బియ్యం ఇవ్వాలంటే 3 సార్లు కాంటా వేయాల్సి వస్తుండడంతో మరింత ఆలస్యం అవుతుంది. నల్లగొండ ఎంఎల్‌ఎస్ పాయింట్ పరిధిలోనే 170 షాపులు ఉన్నాయి. ఆ పాయింట్‌లో 20 మంది వరకు హమాలీలు ఉంటారు. వారు ఈ విధానంలో తూకం వేయడం సాధ్యం కాదనేది స్పష్టమవుతోంది. పెద్ద వేయింగ్ మిషన్లు పెట్టి ఒకేసారి వెహికిల్ ద్వారా తూకం వేసేలా చేస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం అయ్యేలా లేదు. లేదా హమాలీలను పెంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు తలెత్తడంతో వేలిముద్ర ద్వారా డీలర్లకు బియ్యం ఇచ్చే విధానాన్ని అధికారులు మార్చికి వాయిదా వేశారు.

సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి



ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే డీలర్లకు వేలిముద్రల ద్వారా బియ్యం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా కొన్ని సాంకేతిక కారణాల వల్ల చేయలేకపోయాం. మార్చి మాసం నుంచి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగూడూరు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలోఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటయ్య కుమారుడు దాసరి సతీష్(30)కు పది సంవత్సరాల క్రితం దేవరప్పుల గ్రామానికి ఉమతో వివాహం జరిగింది. మూడు సంవత్సరాలుగా భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో భార్య ఉమ తన తల్లిదండ్రులు వద్దేనే ఉంటుంది. సంతీష్ కుటుంబ కలహాలతో మస్తాపానికి గురై ఆదివారం ఇంట్లోనే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించే లోపే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

మంత్రాలయం రూరల్: గుండెపోటుతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన తిరుపతయ్య కుమారుడు సైదులు ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రయాణికులతో మంత్రాలయం చేరుకున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జీపీఎస్ రెసిడెన్సీలో బస చేయగా డ్రైవర్ సైదులులో టెంపో ట్రావెలర్‌లో నిద్రపోయాడు. తెల్లవారుజామున సైదులు (45)కు గుండెపోటు రావడంతో వాహనంలోనే కన్నుమూశాడు. ఉదయం గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు మంత్రాలయం చేరుకుని మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చిందరవందరగా సామగ్రి

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రోడ్డులో హైటెక్ కాలనీలో నివాసం ఉంటున్న పసునూరి సుధాకర్ కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి రాగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి.బీరువాలో దాచిన 15వేల నగదు , 2తులాల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

సంధ్యా సమయం.. ఎరుపెక్కె..


ఏకేబీఆర్ రిజర్వాయర్ వద్ద సూర్యాస్తమయం అందాలు

కొండమల్లేపల్లి : సంధ్యా సమయాన.. సూర్యాస్తమయం ఎరుపు రంగు సంతరించుకుంది.. గంగమ్మను సూర్యాస్తమయం తాకినట్లు.. ఆకాశమే దిగివచ్చిందా అన్నట్లు ఉన్న ఈ దృశ్యం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఏకేబీఆర్) వద్ద ఆదివారం సాయంత్రం కనువిందు చేసింది.

యాదాద్రిలో భక్తుల రద్దీ


ప్రధానాలయంలో భక్తుల కోలాహలం


ప్రధానాలయ వీధుల్లో భక్తుల సందడి

- శ్రీనృసింహుడిని దర్శించుకున్న 35వేల మందికిపైగా భక్తులు

యాదగిరిగుట్ట : వరుస సెలవులు రావడంతో పాటు స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. జంట నగరాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రం, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వంటి ప్రాంతాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఇక శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ పూజలతో..

యాదాద్రికి నిత్య ఆదాయం రూ.48,81,724 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ప్రధాన బుకింగ్‌తో రూ.6,61,800, కైంకర్యాలతో రూ.4,600, సుప్రభాతంతో రూ.9,900, పుష్కరిణితో రూ.1,200, వ్రతాలతో రూ.2,04,800, ప్రచార శాఖతో రూ.20,500, వీఐపీ దర్శనాలతో రూ.3,97,500, యాదరుషి నిలయంతో రూ.1,54,082, ప్రసాద విక్రయంతో రూ.19,07,450, పాతగుట్ట ఆలయంతో రూ.80,460, కల్యాణ కట్టతో రూ.1,47,500, శాశ్వత పూజలతో రూ.30,000, వాహన పూజలతో రూ.19,400, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6,00,000, సువర్ణ పుష్పార్చనతో రూ.1,43,380, వేద ఆశీర్వచనంతో రూ.26,400, శివాలయంతో రూ.10,300, అన్నదానంతో రూ.52,652, బ్రేక్ దర్శనాలతో రూ.3,99,300, ఇతర పూజలతో రూ.10,500 వచ్చినట్లు వివరించారు.


నిత్యకల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు


క్యూ లైన్‌లలో బారులుదీరిన భక్తులు

ఎస్‌వీఆర్ లేబొరేటరీస్‌లో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న ఫైర్‌సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెం గ్రామంలోని ఎస్‌వీఆర్ లేబొరేటరీస్‌లో ఆదివారం మధ్యాహ్నం ఏ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే కార్మికులు, సిబ్బంది అప్రమత్తంమై ఫైరింజన్ సహాయంతో మంటలార్పడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో కంపనీలోని ఏ బ్లాక్‌లో గల రియాక్టర్‌లోనికి టోలిన్ అనే సాల్వెంట్‌ను లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు కార్మికులు భయంతో కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన కంపనీ యాజమాన్యం కంపనీలో గల అగ్నిమాపక పరికరాలతో పాటు ప్రక్కనే ఉన్న హెజెలో లాబోరేటిస్ చెందిన ఫైర్ ఇంజిన్‌ను తెప్పించి మంటలార్పారు. అలాగే చౌటుప్పల్‌లోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చేలోపు మంటలార్పారు. సమాచారం అందుకొన్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అక్కడ విధులు నిర్వహించిన కార్మికులను అడిగితెలుసుకొన్నారు. అయితే మంటలు ఏలా వచ్చాయని విచారణలో తేలుతుందని ఎస్‌ఐ బాద్యానాయక్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాగా కంపనీ యాజమాన్యం అప్రమత్తంగా వ్యవహరించడంతోనే ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. అయితే గతంలో కూడ సరైన భద్రత, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇలాగే అగ్ని ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా భద్రత నియమాలను పాటించాలని కోరుతున్నారు.


ప్రమాదం సంభవించిన రియాక్టర్ ఇదే


కార్మికులను విచారిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

- భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- మాడ్గులపల్లి మండల పరిధిలో ఘటన


లక్ష్మణరేఖ (ఫైల్)

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ శివారు అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం ఈదులగూడేనికి చెందిన దైద వెంకన్న సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో నల్లగొండలోని గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న తమ కూతురు కావ్యశ్రీను చూసేందుకు భార్య లక్ష్మణరేఖ(37)తో కలిసి బైక్‌పై మిర్యాలగూడ నుంచి బయలుదేరారు. కాగా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులోకి రాగానే అతివేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై లక్ష్మణరేఖ అక్కడికక్కడే మృతిచెందగా వెంకన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ నరేష్‌లు లక్ష్మణరేఖ మృతదేహాన్ని, తీవ్రంగా గాయపడిన వెంకన్నను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకన్నను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. మృతురాలి అక్క లోకేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

కేతేపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసగృహం దగ్ధమై రూ.2లక్షల నష్టం సంభవించింది. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ గ్రామంలోని జంగాల కాలనీకి చెందిన ఎదురుగట్ల వెంకట్రాములు బొగ్గుబట్టీల కోసం అవసరమైన కట్టెలు కొట్టే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి వెంకట్రాములు తన భార్య, పిల్లలతో కలసి పూరి గుడిసె అయిన తన నివాస గృహంలో నిద్రిస్తుండగా తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెకు నిప్పంటుకుంది. మంటలు గమనించిన వెంకట్రాములు కుటుంబంతో కలసి కేకలు వేస్తూ ఇంటి నుంచి బయటికి వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇరుగు పొరుగు వారితో కలసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు కాకపోవటంతో నకిరేకల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు.


గుడివాడ గ్రామంలో దగ్ధమవుతున్న పూరి గుడిసె

ఫైర్ సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని మంటలు ఆర్పినప్పటికీ పూరి గుడిసె పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో ఇంట్లో ఉంచిన రూ.40వేల నగదు, రెండు తులాల బంగారంతో పాటు, బట్టలు నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధితుడు వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇద్దరిపై కేసు

రామగిరి(నల్లగొండ): ఇరు వర్గాల ఘర్షణలో ఇద్దరిపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పల్లె మైసయ్య ఇంటి ఎదురుగా ఉన్న పల్లె లావణ్య ఇంటి ముందు మోరీ నుంచి తీసిన చెత్త వేశాడు. ఇదేంటడి లావణ్య అడిగింది. పల్లె మైసయ్య అతని భార్య మంజులకు పల్లె లావణ్య సోదరుడు మహేష్‌కు తీవ్ర గొడవ జరిగింది. ఈ గోడవలో లావణ్య అతని సోదరుడు మహేష్‌పై మైసయ్య మంజుల దాడి చేశారు. పల్లె లావణ్య తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదివారం పల్లె మైసయ్య మంజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయుడి చొరవతో బాలుడి ఆచూకీ లభ్యం

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ ఉపధ్యాయుడి చొరవతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ లభ్యమైన ఘటన ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. డీఎస్పీ వెంకటగిరి, వన్‌టౌన్ సీఐ రాఘవేందర్, ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలుడు ఆదివారం ఉదయం 7గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. బాలుడి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వివరాలు ఉంచి గాలింపు చెపట్టారు. ఈ క్రమంలో బాలుడు నల్లగొండలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకన్న కారులో లిఫ్ట్ అడిగి కొంతదూరం ప్రయాణించి ఒక చోట దిగాడు. బాలుడి ప్రవర్తన అనుమానంగా ఉండటంతో కొద్ది దూరం బాలుడిని అనుసరించిన ఉపాధ్యాయుడిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. అనంతరం బాలుడిని తన వెంట ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులు వచ్చాక అప్పగించాడు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంపోడు : మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 15 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 13 మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. బాలికల కోసం మిర్యాలగూడెం, నల్లగొండ, నకిరేకల్, కోదాడ, హుజూర్‌నగర్, ఆలేరులలో పాఠశాలల్లో ఐదవ తరగతిలో 80 సీట్లు, కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఒక్కో కళాశాలలో 80 సీట్లు ఉన్నాయి. బాలుర కోసం దేవరకొండ, నల్లగొండ, అనుముల, సుర్యాపేట, తుంగతుర్తి, భువన గిరి, చౌటుప్పల్‌లో పాఠశాలల్లో 80 సీట్లు, ఒక్కో కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 80 సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారు నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌కు కూడా దరఖాస్తులు అందించవచ్చునని తెలిపారు. ఇంటర్ ప్రవేశాలకు పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో www. tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో, ఆఫ్‌లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సీట్ల కేటాయింపు ఇలా..

మొత్తం 80 సీట్లలో ముస్లిం మైనార్టీలకు 51సీట్లు, క్రిస్టియన్ మైనార్టీలకు 5 సీట్లు, పార్శీలు, బౌద్దులు, సిక్కులకు ఒక్కో సీటు, నాన్ మైనార్టీ కోటాల్లో ఎస్సీలకు 5, ఎస్టీలకు మూడు, బీసీలకు 10, ఓసీలకు 2 చొప్పున సీట్లు కేటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాలు సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 13 పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లకు ఈ నెల 15 వ తేదీ చివరి తేదీ. అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

పేద రోగులకు వరం

విస్తరిస్తున్న డయాలసిస్ సేవలు

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కేంద్రం ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఇప్పటికే ఆలేరు, చౌటుప్పల్‌లో అందుబాటులోకి..
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తీరనున్న ఇబ్బందులు


డయాలసిస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పతకలు

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఈ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందినున్నాయి. భువనగిరి పట్టణంతో పాటు పరిసర, జిల్లాలోని ఇతర ప్రాంతాల వారు డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– చిన్ననాయక్, డీసీహెచ్‌ఎస్

భువనగిరి : కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడే వారికోసం జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ఎంతో ఖర్చుతో కూడుకున్న డయాలసిస్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పటికే చౌటుప్పల్, ఆలేరు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ల ద్వారా ఉచిత సేవలు అందజేస్తుండగా ఇకనుంచి భువనగిరిలోనూ అందనున్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారు.


ఐదు పడకలతో డయాలసిస్ సెంటర్

ఉస్మానియా ఆస్పత్రి హబ్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న 23 డయాలసిస్ కేంద్రాల్లో భాగంగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ ఏర్పాటు చేశారు.దీని కోసం రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇందులో ఐదు పడకలు, ఐదు డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి హెచ్‌ఐవీ బాధితులకు, మిగితావి సాధారణ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం కేటాయించారు. ఒక ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా చికిత్స నిర్వహించనున్నారు. ఒక్కొక్కరికి నాలుగు గంటల సమయం పట్టనుంది. రోజు 20 నుంచి 25 మంది కిడ్నీ బాధితులకు వైద్య సేవలు అందజేస్తారు.సెంటర్‌లో మొత్తం 8 మంది సిబ్బంది ఉంటారు. ఒకరు డేటా ఎంట్రీ ఆపరేటర్,7గురు టెక్నీషియన్లు విధులు నిర్వహిస్తారు. ఉస్మానియా ఆస్పత్రికి చెందిన లెప్రాలజీ డాక్టర్, జిల్లా కేంద్ర వైద్యశాలకు చెందిన జనరల్ ఫిజీషియన్ సేవలందిస్తారు.

తీరనున్న ఇబ్బందులు

జిల్లాకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్సకోసం హైదరాబాద్, వరంగల్ నగరాలకు వెళ్లేవారు. దీంతో వారు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. విలువైన వైద్యం కావడంతో ఆర్థికస్థోమత లేక పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం చౌటుప్పల్, ఆలేరు ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందుతుండడంతో స్థానికులు, పరిసర మండలాల బాధితులు అక్కడే చికిత్స పొందుతున్నారు. నేటి నుంచి భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ డయాలసిస్ సేవలు ప్రారంభంకానుండడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే బాధలు తప్పనున్నాయి.

బేతవోలులో ముగిసిన ఎడ్ల పందేలు


ఎడ్ల పందేలలో బండ లాగుతున్న ప్రథమ బహుమతి సాధించిన గుంటూరు ఎద్దు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో కనకదుర్గ జాతర సందర్భంగా పశు ప్రదర్శన, గ్రామ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేలు ఆదివారం రాత్రి ముగిశాయి. పోటీల్లో గుంటూరు జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన కటికం వెంకటేశ్వర్లు ఎద్దు ప్రథమ బహుమతి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎద్దు ద్వితీయ బహుమతి, సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డికి చెందిన ఎద్దు తృతీయ బహుమతి, పల్నాడు జిల్లా అమరావతికి చెందిన బండ్ల సాయి శ్రీ భవనకు చెందిన ఎద్దు నాల్గొవ బహుమతిని సాధించాయి. గెలుపొందిన విజేతలకు ఎడ్ల యాజమానులకు బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కె.శశిధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, సర్పంచ్ వట్టికూటి చంద్రకళనాగయ్య, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, సైదాబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చాన్స్ ఎవరికి?

హామీ దక్కిన వారికా.. కొత్త వ్యక్తులకా?

- మార్చిలో ముగియనున్న ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం
- జిల్లా బీఆర్‌ఎస్ నేతల్లో పదవి టెన్షన్
- సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద ప్రయత్నాలు



సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్సీ పదవి కోసం జిల్లా బీఆర్‌ఎస్‌లో కోలాహలం మొదలైంది. శాసనసభ్యుల కోటాలో ఎన్నికైన ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం మార్చి 29న ముగియనుంది. ఈ నేపథ్యంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే అధినేత కేసీఆర్ ఇప్పటికే పలువురికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు వారికే ఇస్తారా లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తారా అన్నది చర్చనీయాంశమైంది.

ఎవరి ప్రయత్నాల్లో వారు

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు ఎలిమినేటి కృష్ణారెడ్డికి ఆరేళ్ల క్రితం శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కిన విషయం తెలిసిందే. వచ్చేనెల ఆయన పదవీకాలం ముగియనుండడంతో ఆశావహులు ఆ సీటుపై కన్నేశారు. ఈ దఫా తమకు అవకాశం కల్పించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి ద్వారా కొందరు ప్రయత్నిస్తుండగా.. మరికొందరు నేరుగా అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వేడుకుంటున్నారు.

తమకే వస్తుందన్న ధీమా

అధినేత కేసీఆర్ వివిధ ఎన్నికల సందర్భంగా పార్టీలోని పలువురు ముఖ్య నేతలకు పదవుల విషయంలో హామీ ఇచ్చినట్లు ప్రచారం ఉంది. దీంతో వారు ధీమాతో ఉన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బీజేపీలో చేరారు. ఈ భర్తీని పూడ్చేందుకు బీజేపీలో ఉన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను పార్టీ పెద్దలు రాత్రికిరాత్రి ఒప్పించి కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పారు. అంతకుముందు బీఆర్‌ఎస్‌లో ఉన్న భిక్షమయ్య ఆలేరు ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఉద్దేశంతో టికెట్ అవకాశం కోసం బీజేపీ గూటికి చేరారు. అయితే మార్చిలో రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎక్కడో ఒక చోట నుంచి అవకాశం కల్పిస్తానని భిక్షమయ్యగౌడ్‌కు అధినేత కేసీఆర్ మాటివ్వడంతో ఆయన తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా సామాజిక వర్గ సమీకరణల్లో భాగంగా పార్టీ అవసరాల దృష్ట్యా భిక్షమయ్యగౌడ్‌కు అవకాశం దక్కనుందన్న ప్రచారం సాగుతోంది.

మరికొందరు

ఇక జిల్లాకు చెందిన సీనియర్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఖాయమైందన్న ప్రచారం జరిగింది. అయితే చివరి నిమిషంలో దివంగత నేత ఎలిమినేటి మాధవరెడ్డి కుమారుడు ఎలిమినేటి సందీప్‌రెడ్డికి ఆ పదవి దక్కింది. దీంతో ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని, అప్పట్లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని చింతల వర్గీయులు చెబుతున్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు సమసిపోవడానికి ఒక ప్రయత్నంగా అధిష్టానం ఎవరికో ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి తనకు మరోమారు అవకాశం కల్పించాలని మనసులో ఉన్న మాటను తన వర్గీయులతో అన్నట్లు తెలుస్తోంది. అయితే తనకంటే కూడా తన కుమారుడు వివేక్ రెడ్డి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని కేసీఆర్‌ను కోరినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ సంస్థాన్‌నారాయణపురానికి చెందిన కర్నె ప్రభాకర్, శాసన మండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సామాజిక సమీకరణలపై లెక్కలు

ఎమ్మెల్సీ పదవి కోసం ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్న పలువురు బీఆర్‌ఎస్ నేతలు సామాజిక వర్గ సమీకరణలపైనా లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్ర యూనిట్‌గా ఎమ్మెల్సీ అభ్యర్థులను అధినేత ఎంపిక చేయనున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గ సమీకరణలు బలంగా పని చేయనున్నాయి. మార్చిలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ సామాజికవర్గానికి చెందిన స్థానం ఉంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బలమైన సామాజిక వర్గానికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీసీ గౌడ సామాజిక వర్గానికి ప్రాతినిథ్యం లేనందున ఆ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వచ్చన్న ప్రచారం జరుగుతోంది.